నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 16-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:37 పేజీలు: 4 వెల: రూ.1/-

కేంద్రవిద్యుత్ బిల్లు సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు

బిల్లుతో ఇక కరెంట్ గురించి కేంద్రంలో ఆరా తీయాలి
700 కోట్లతో ప్రతి బోరుకు మీటర్ బిగించాలి
వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపనున్నది
కేంద్ర బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం
కాంగ్రెస్,బిజెపిల పాలనా తీరుపై మండిపడ్డ సిఎం కెసిఆర్

కరోనా కాలం నాటి విద్యుతు ఛార్జీల సవరణకు హామీ

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): కేంద్ర విద్యుత్ చట్టం చాలా ప్రమాదకరమని, ఈ బిల్లును పార్లమెంట్‌లో పూర్తి స్థాయిలో వ్యతిరేకిస్తున్నామని శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సిఎం కెసిఆర్ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేంద్ర బిల్లు రాష్ట్రాల హక్కులు హరించేదిగా. సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలి పెట్టులాగా ఉందని కెసిఆర్ వ్యాఖ్యానించారు. గతంలో తాను విద్యుత్ సమస్యపైనే తెలంగాణ జెండా ఎత్తానని, ఇందిరాపార్క్ వద్ద పారిశ్రామిక వేత్తలు విద్యతు÷– కోసం చేసిన ధర్నాలు మరచిపోగలమా అని అన్నారు. స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంత్రి జగదీశ్వర్ రెడ్డి చర్చలో పాల్గొన్న సీఎం కేసీఆర్ కేంద్రం తీరును తీవ్రంగా దుయ్యబట్టారు. దీనిని ప్రతి రాష్ట్రం వ్యతిరేకిస్తోందన్నారు. తాను అందరు సిఎంలతో మాట్లాడానని అన్నారు. దేశంలో 70 వేల టీఎంసీల నీరు ఉంది. కానీ చెన్నైలో తాగునీటికి అనేక సమస్యలు ఉన్నాయి. దేశంలో 75 శాతం మంది మంచినీటి కోసం అల్లాడుతున్నారు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చాలనే దృక్పథం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు లేకుండా పోయింది. దేశంలో 40 కోట్ల ఎకరాల భూమి సాగులో ఉంది. పుష్కలంగా సరిపోయే నీరు ఉన్నా.. సాగుకు నీరుఇవ్వలేదు. దేశంలో స్థాపిత విద్యుత్ శక్తి 4 లక్షల మెగావాట్ల పైనే ఉంది. ఇప్పటి వరకు 2 లక్షల 16 వేల మెగావాట్లు మాత్రమే దేశంలో వాడారు. దేశ ప్రగతి కోసం మిగులు విద్యుత్‌ను వినియోగంలోకి తేవాలనే ఆలోచన లేదు. కేంద్ర విద్యుత్ చట్టాన్నితాము పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తామన్నారు. విద్యుత్ రంగంలో రాష్ట్రాల హక్కులు హరించారు అని సీఎం ధ్వజమెత్తారు. కేంద్రం ప్రవేశపెట్టిన చట్టం చాలా ప్రమాదకరంగా ఉందని సమూనా బిల్లు కూడా పంపించారు. ఈ నేపథ్యంలోనే తాను కేంద్రానికి లేఖ రాశాను. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దేశాన్ని పరిపాలించే విధానంలో.. అంబేద్కర్, ఇతర గొప్ప వ్యక్తులు ప్రవేశపెట్టిన ఆదేశిక సూత్రాలను ఉల్లంఘిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఎవరున్నా రాష్ట్రాల హక్కులను హరిస్తున్నారు. రాష్ట్రాల లోడ్ సెంటర్లు అన్నీ కేంద్రం వద్దకు వెళ్తాయన్నారు. విద్యుత్ రంగం ప్రభుత్వం వద్ద ఉంటే డిస్కంలు, ట్రాన్స్ కో, జెన్ కో అభివృద్ధి చెందుతాయి. ఈ సంస్థలు లేకుండా వేల ఉద్యోగాలు పోతాయి. కేంద్ర విద్యుత్ చట్టం వస్తే ఇష్టారాజ్యంగా ప్రైవేటు కంపెనీలు వస్తాయి. ప్రభుత్వం వద్ద ఉన్న అధికారాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తారు. కేంద్ర విద్యుత్ చట్టం వస్తే ఈఆర్సీ నియామకాలు తమ చేతిలో ఉండవని స్పష్టం చేశారు. కేంద్ర విద్యుత్ చట్టంలో అనేక లోపాలు ఉన్నాయని కేసీఆర్ గుర్తు చేశారు. కొత్త చట్టం ప్రకారం పొలం లోని ప్రతి బోరుకు మీటర్లు పెట్టాల్సి వస్తుందన్నారు. కొత్త మీటర్ల కోసం రూ. 700 కోట్లు కావాలన్నారు. మీటర్ రీడింగ్ తీస్తారు.. బిల్లులు ముక్కు పిండి వసూలు చేస్తారు. తన చిన్నప్పుడు బిల్లు కలెక్టర్ ను చూస్తే రైతులు ఎంతో భయపడేవారు. రాష్ట్రంలోని 26 లక్షల బోర్లకు మీటర్లు పెట్టేందుకు రాష్ట్ర బీజేపీ నేతలు,నలుగురు ఎంపిలు, ఓ కేంద్రమంత్రి ఒప్పుకుంటారా? అని సీఎం ప్రశ్నించారు. కేంద్రం తెచ్చే చట్టాన్ని అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని సీఎం కేసీఆర్ తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలకు కాంగ్రెస్, టీడీపీనే కారణమంటూ సీఎం కేసీఆర్ విమర్శించారు. ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చే ప్రణాళిక కేంద్రం దగ్గర లేదని పేర్కొన్నారు. కేంద్ర విద్యుత్ చట్టాన్ని టీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్‌లో వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. మిగులు విద్యుత్‌ను దేశ ప్రగతికి వినియో గించాలనే ఉద్దేశం కేంద్రానికి లేదని ధ్వజమె త్తారు. కరోనా కారణంగా 3 నెలల బిల్లులు ఒకేసారి వచ్చాయని, విద్యుత్ బిల్లులు తగ్గేలా చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో లాక్‌డౌన్ విధించిన కారణంగా విద్యుత్ బిల్లులు రికార్డు చేయలేదు. ఆ సమయంలో అధికంగా వచ్చిన విద్యుత్ బిల్లులు తగ్గేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లు, శ్రీశైలం పవర్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంపై శాసనసభలో స్వల్ప కాలిక చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. కొవిడ్ సందర్భంలో విద్యుత్ బిల్లులు రికార్డు చేయలేదు కాబట్టి మూడు నెలలు కలిపి వేయడం ద్వారా ఎక్కువ బిల్లు వచ్చిందని సభ్యులు చెప్పారు. ప్రజలకు భారమైతుందని చెప్పారు. అది వాస్తవం కావొచ్చు.. కాకపోవచ్చు. నాకు తెల్వదు. కానీ మీరు దృష్టికి తెచ్చినందుకు వంద శాతం ఇప్పుడే ఆర్డర్లు ఇస్తాం. ఆ మూడు నెలలు డివైడ్ చేసి ఏదైనా భారం పడితే తొలగిస్తామని హామీ ఇస్తున్నాం. అటువంటి భారం ప్రజలపై పడనివ్వమని సీఎం స్పష్టం చేశారు. ఇకపోతే శ్రీశైలం ప్రమాదంలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ప్రకటించారు.

పుల్వామాలో ఎన్‌కౌంటర్

ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): పుల్వామాలోని మార్వాల్ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. పోలీసులు, భద్రతా బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను చేపడుతున్నాయి. ఇటీవల కొద్ది రోజులుగా జమ్మూకశ్మీర్‌లోని ఉగ్రవాదుల ఏరివేత ముమ్మరంగా కొనసాగుతోంది. పోలీసులు, భద్రతా బలగాలు ముమ్మర తనిఖీలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మార్వాల్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు సోదాలు నిర్వహించగా.. బలగాలను చూసి ఉగ్రవాదులకు కాల్పులకు తెగబడినట్లు సమాచారం. కాగా, ఈ నెల 11న బుద్గాం జిల్లాలో కపూసా ఖలీసా ప్రాంతంలోనూ భద్రతా బలగాల కాల్పులల్లో ఓ ఉగ్రవాది హతమయ్యాడు. అలాగే ఈ నెల 7న గాలింపు బృందాలపై కాల్పులు జరిపిన ఉగ్రవాది.. సెక్‌నాగ్ నాలాలో దూకాడు. అయితే అప్పటికే బలగాలు ఎదురు కాల్పులు జరపడంతో అతని మెడకు తీవ్రంగా గాయమై మృతి చెందగా, మృతదేహం నాలాలో బయటపడింది.

సభ్యులు కరోనా జాగ్రత్తలు తీసుకోవాలి: స్పీకర్

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఏడో రోజూ కొనసాగాయి. ఈ సందర్భంగా శాసనసభ్యులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యేలంతా తప్పనిసరిగా మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని సూచించారు. నోరు, ముక్కు కవర్ అయ్యేలా మాస్కు పెట్టుకోవాలని సభ్యులకు స్పీకర్ సూచన చేశారు. సభ్యులందరూ సభకు సహకరించి సజావుగా జరిగేలా చూడాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఇప్పటికిప్పుడు విద్యాసంస్థలను తెరవలేం

కేంద్ర మార్గదర్శకాల మేరకే నడుచుకోవాలి
మండలిలో సభ్యుల ప్రశ్నలకు మంత్రి సబిత సమాధానం

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ప్రభావం విద్యా రంగంపై తీవ్ర ప్రభావం చూపిందని, ఈ దశలో ఇప్పుడే విద్యా సంస్థలను ప్రారంభించలేమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. విద్యా సంస్థలు తెరిచేందుకు మరికొంత సమయం పట్టనుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలలు తెరుస్తామని స్పష్టం చేశారు. విద్యా సంవత్సరం నష్టపోకుండా ఉండేందుకు ఆన్‌లైన్ క్లాసులకు రూపకల్పన చేశామన్నారు. విద్యార్థులందరికీ ఉచితంగా బుక్స్‌ను పంపిణీ చేశామని తెలిపారు.ఈ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా మార్చి 16 నుంచి పాఠశాలలను మూసివేయడం జరిగిందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పాఠశాలల ప్రారంభం, ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. లాక్‌డౌన్ సమయంలో పరీక్షల నిర్వహణపై కూడా ఆందోళన కూడా నెలకొంది. సీఎం చొరవ తీసుకుని అన్ని తరగతుల విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేశామన్నారు. పదో తరగతి విద్యార్థులందరినీ పాస్ చేశామన్నారు.

విద్యాశాఖ తరపున మూడు రకాల సర్వే చేశామని చెప్పారు. రాష్ట్రంలో 85 శాతం మంది విద్యార్థుల నివాసాల్లో టీవీ ఉందని సర్వేలో తేలిందన్నారు. సర్వే ప్రకారం 40 శాతం విద్యార్థుల ఇళ్లల్లో స్మార్ట్ ఫోన్లు ఉన్నాయన్నారు. టీవీ, స్మార్ట్ ఫోన్లు లేని వారిని పక్కవారితో అనుసంధానం చేశామని తెలిపారు. దూరదర్శన్, టీ శాట్ యాప్‌లో డిజిటల్ క్లాసులు అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థుల ఫీడ్ బ్యాక్ కోసం వర్క్ షీట్స్ తయారు చేశామని చెప్పారు. విద్యార్థులందరూ ఆన్‌లైన్ క్లాసులు వింటున్నారని మంత్రి తెలిపారు. 48 వేల వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ బోధనను అందిస్తున్నామని పేర్కొన్నారు. అత్యధిక ఫీజులు వసూలు చేయొద్దని సీఎం కేసీఆర్ గట్టిగా చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు.

పర్యాటక రంగాల అభివృద్ధికి కృషి

అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి శ్రీనివాసగౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేలా తెలంగాణలో టూరిజంను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. జలవనరులు ఉన్న ప్రాంతాలన్నింటినీ పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. టూరిజం అభివృద్ధి చెందుతున్న సమయంలో కొవిడ్ దెబ్బతీసిందన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నర్సంపేట నియోజకవర్గం పరిధిలో పర్యాటకాభివృద్ధిపై ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పాకాల సరస్సు వద్ద నిధులు ఖర్చు పెట్టి అభివృద్ధి చేశామన్నారు. దీన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వరంగల్‌లో కాళోజీ ఆడిటోరియాన్ని ఏర్పాటు చేశామన్నారు. వరంగల్ పరిసర ప్రాంతాల్లో మంచి టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని తెలిపారు. యాదాద్రిలో కూడా అద్భుతమైన టూరిజంను ఏర్పాటు చేసి అందరినీ ఆకర్షించేలా చేస్తామన్నారు. నదులు, సరస్సులపై అద్భుతమైన దృశ్యాలను ఏర్పాటు చేసి ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

పాడి అభివృద్ధికి కెసిఆర్ ప్రత్యేక చర్యలు

విజయా డెయిరీని మరింత ఆధునీకరిస్తున్నాం
రావిర్యాలలో మెగా డెయిరీ ఏర్పాటుకు నిర్ణయం
పాడి బకాయిలను త్వరలోనే చెల్లిస్తాం
అసెంబ్లీలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): పాడి పరిశ్రమ అభివృద్ధికి అడగకుండానే సిఎం కెసిఆర్ నిధులు ఇస్తున్నారని, విజయ డెయిరీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సిఎం కెసిఆర్ పాడిరైతులకు లీటర్‌కు నాలుగు రూపాయలు ఇన్సెంటీవ్ ఇస్తున్నారని, అంతర్జాతీయ స్థాయి మెగా డెయిరీ ఏర్పాటుకు రావిర్యాలలో పనులు జరుగుతున్నాయని, ఎస్‌సిలకు 75 శాతం సబ్సిడీతో పాడి గేదెలు ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. విజయ డెయిరీకి అంతర్జాతీయ స్థాయి బ్రాండింగ్ చేస్తామని, గద్వాలలో విజయ డెయిరీ ఏర్పాటు చేస్తామని తలసాని స్పష్టం చేశారు. పాడి గేదెల ద్వారా ఉపాధి కోసం రూ.243 కోట్లు ఇచ్చామని మంత్రి తలసాని వ్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా పలువురు సభ్యులు ప్రశ్నలకు తలసాని సమాధానం ఇచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సిఎం కెసిఆర్ చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. కరోనా వల్ల రైతులకు ఇచ్చే ఇన్సెంటివ్ కొంత బకాయి ఉందన్నారు. వీటిని త్వరలోనే చెల్లిస్తామన్నారు. అయితే కరోనా కారణంగా కొంత ఆలస్యం జరిగినా త్వరలోనే చెల్లింపులు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. దీంతో పాటు పాడి పరిశ్రమ పట్ల సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2 లక్షల 13 వేల మంది రైతులకు ప్రయోజనం కల్పించేందుకు పాడి పశువుల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిరాలలో గ్రీన్ ఫీల్డ్ మెగా డైరీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. 4 సహకార డైరీలకు పాలు పోసే పాడి రైతులకు ఒక్కొక్క లీటర్ రూ. 4 ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో దేశంలో ఏ రాష్ట్రం పాడి రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదన్నారు. ఈ ప్రోత్సాహకాల కోసం రూ. 248 కోట్ల 3 వేలు విడుదల చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. విజయ డైరీ ఇప్పుడిప్పుడే గాడిలో పడుతుందని మంత్రి తెలిపారు. 50 శాతం సబ్సిడీతో పాడి గేదేలు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రోత్సాహకాలు ఉండేవి కావు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఉదార స్వభావంతో ఒక్కో లీటర్‌కు రూ. 4 ప్రోత్సాహకాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. పాడి పరిశ్రమకు సీఎం కేసీఆర్ అడగకుండానే నిధులు ఇస్తున్నారు. కానీ కొవిడ్ పరిస్థితుల వల్ల కొంత ఆటంకం కలిగిందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సీఎం కేసీఆర్ చర్యలు తీసుకుంటున్నారని మంత్రి స్పష్టం చేశారు.

మిగులు విద్యుత్‌పై భట్టి వ్యాఖ్యలకు మంత్రి కౌంటర్

పంజాబ్, రాజస్థాన్‌లలో 24గంటల కరెంట్ ఎందుకు ఇవ్వడం లేదు
గత పాపాలను విస్మరించి మాట్లాడడం తగదని హితవు

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): మిగులు విద్యుత్ ఉంటే కాంగ్రెస్ పాలిత పంజాబ్, రాజస్థాన్‌ల్లో 24 గంటల ఉచిత విద్యుత్ ఎందుకు ఇవ్వడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్కపై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. అక్కడ నిరంతర విద్యుత్‌ను ఎందుకు అమలు చేయడం లేన్నారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతిపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై మంత్రి మండిపడ్డారు. గత ప్రభుత్వాల హయాంలో విద్యుత్ రంగంలో ఉన్నది ఉన్నట్టే చెప్పాం.. అబద్ధాలు మాత్రం చెప్పలేదు. రాష్ట్రం ఏర్పడే కంటే ముందు 7 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉంటే.. రాష్ట్రం ఏర్పడ్డాక అది 17 వేల మెగావాట్లకు చేరిందని చెప్పాం. తామేం తప్పు చెప్పలేదు అని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోనే 2 నుంచి 4 గంటల పాటు కరెంట్ కట్ చేసేవారు. గ్రామాల్లో 6 నుంచి 8 గంటల పాటు కరెంట్ తీసేవారు. రైతాంగానికి 3 గంటలకు మించి కరెంట్ ఇవ్వలేదు. ఇవన్నీ మా హయాంలో జరిగినవి కాబట్టే చెప్పాం. మా హయాంలో ఏం జరిగిందో చెప్పామని మంత్రి పేర్కొన్నారు.మీరు ప్రారంభించిన ప్రాజెక్టుల్లో ఏ పని కూడా పూర్తి కాలేదు. మీరు 10 నుంచి 30 శాతం పనులు పూర్తి చేస్తే.. తమ ప్రభుత్వం 100 శాతం పనులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. పులిచింతల, కేటీపీపీ స్టేజ్ 2తో పాటు ఎస్ఈపీపీ సింగరేణి ప్రాజెక్టును తామే పూర్తి చేశామని మంత్రి స్పష్టం చేశారు. భద్రాద్రి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఎన్జీటీ కేసు వల్లే ఆలస్యమైందన్నారు. మీరు విద్యుత్ రంగంలో చర్యలు తీసుకుంటే రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారు మీరు అన్ని పనులు చేస్తే తెలంగాణ రాక ముందు చీకట్లు ఎందుకు? అని ప్రశ్నించారు. పరిశ్రమలు ఎందుకు మూతపడ్డాయి? రైతాంగానికి 24 గంటల ఉచిత, నాణ్యమైన కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన పంజాబ్, రాజస్థాన్‌లో 24 గంటల కరెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతులకు కరెంట్ సమస్యలు తొలగినాయి. ఆత్మహత్యలు తగ్గాయని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ సమస్యను మూడేళ్లలో సరిచేసిన నాయకుడు కేసీఆర్ అని మంత్రి జగదీశ్ రెడ్డి గుర్తు చేశారు. ఇకపోతే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నగరంలోని పాతబస్తీలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లు, శ్రీశైలం పవర్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా యాకుత్‌పుర ఎంఐఎం ఎమ్మెల్యే పాషా ఖాద్రీ అడిగిన ప్రశ్నలకు మంత్రి జగదీశ్ రెడ్డి సమాధానం ఇచ్చారు. విద్యుత్ రంగంలో ప్రభుత్వ చర్యలను పాషా ఖద్రీ అభినందించడం సంతోషించదగ్గ విషయమన్నారు. మాదన్నపేటలో ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ ఇచ్చామని మంత్రి తెలిపారు. పాతబస్తీలో అండర్ గ్రౌండ్ కేబుల్ పని ప్రారంభమైంది. 206కి.మీ. పూర్తి చేశాం. పాతబస్తీకి కొత్త సబ్ స్టేషన్లు కూడా మంజూరు చేశాం. మొత్తం 15 సబ్ స్టేషన్లు మంజూరు చేసి 9 పూర్తి చేశామన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పాతబస్తీలో దాదాపు 1300 కోట్లు ఖర్చు పెట్టామని మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ప్రభుత్వం

–కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగ కార్మికులతో పాటు ఇతర కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి స్పష్టం చేశారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు.శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నిర్మాణరంగ కార్మికుల సంక్షేమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం 9 సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి తెలిపారు. కార్మికుల భద్రత, ఆరోగ్యం కోసం పథకాలను రూపొందించి అమలు చేయడం జరుగుతుంది. 9,15,287 మంది కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 9 సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు 1,512 కోట్ల 85 లక్షల 10 వేల 821 రూపాయాలు భవన నిర్మాణ కార్మికులతో పాటు ఇతర కార్మికులకు, వారి కుటుంబాలకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే 6 లక్షల పరిహారాన్ని ఇస్తున్నామని చెప్పారు. గతంలో ఈ పరిహారం రూ. 2 లక్షలు ఉండే అని గుర్తు చేశారు. అంగవైకల్యం కలిగితే 2 లక్షల పరిహారాన్ని 5 లక్షలకు, సహజ మరణం చెందితే 30 వేల నుంచి 60 వేలకు, అంత్యక్రియల కోసం 5 వేల నుంచి 30 వేల వరకు, వివాహ కానుక, ప్రసూతి సాయానికి 5 వేల నుంచి 30 వేలకు పెంచడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 2,203 కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ. 6 లక్షల చొప్పున 115 కోట్ల 75 లక్షల 43 వేల 382 రూపాయాలు చెల్లించామని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు కూడా నిధులు కేటాయిస్తున్నామని మల్లారెడ్డి తెలిపారు. వారు తమ సమస్యలను చర్చించుకునేలా భవనాలు నిర్మించాలని పలువురు సభ్యులు కోరారు.

బ్యాక్ వాటర్‌లో మునిగిన శివాలయాలు

నిజామాబాద్,సెప్టెంబర్15 (ఆంఎన్ఎ): శ్రీరాం సాగర్ బ్యాక్ వాటర్‌లో శివాలయాలు మునిగిపోయాయి. నందిపేట మండలం ఉమ్మెడలోని ఉమా మహేశ్వరాలయం గర్భ గుడితో పాటు ప్రాంగణమంతా జలమయమైంది. దీంతో నెలన్నర వరకు నిత్య పూజలు రద్దు చేయనున్నారు. మహారాష్ట్ర నుంచి వరద ప్రవాహం పెరగడంతో రెంజల్ మండలం కందకుర్తి వద్ద సంగమేశ్వరాలయం సైతం నీటి మునిగింది.అలాగే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పలు ప్రాజెక్టుల్లోకి వరద నీరు వస్తుండటంతో మత్తడి పోస్తున్నాయి. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు మత్తడి పోస్తున్నది. వస్తున్న భారీ వానతో అలుగు పారుతోంది. నిజాంసాగర్ మండలంలోని సింగీతం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరింది. వరద వస్తుండటంతో అధికారులు మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. అలాగే ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి ప్రాజెక్టు 4గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

కరోనాతో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మృతి

భోపాల్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి సామాన్యులతో పాటు రాజకీయ నాయకులు, ప్రముఖులను వణికిస్తోంది.

ఇప్పటికే మహమ్మారిన బారినపడి పలువురు రాజకీయ నాయకులు మృతి చెందగా.. తాజాగా మధ్యప్రదేశ్‌లో మరో ఎమ్మెల్యే వైరస్ బారినపడి మృత్యువాతపడ్డారు. బియోరా కాంగ్రెస్ ఎమ్మెల్యే గోవర్ధన్ దాంగి కరోనాతో మృతి చెందారు. ఇటీవల ఆయన కరోనా పాజిటివ్‌గా పరీక్షించగా, భోపాల్‌లోని ఓ దవాఖానలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఢిల్లీ గురుగ్రామ్ మేదాంత దవాఖానలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం ఆయన కన్నుమూశారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ట్విట్టర్‌లో ఆయన మృతికి సంతాపం ప్రకటించింది. బీజేపీ నాయకుడు కైలాష్ విజయ్ సైతం సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే గోవర్ధన్ డాంగి మృతితో మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేల ఖాళీల సంఖ్య 28కి చేరింది. అలాగే కాంగ్రెస్ సభ్యుల బలం 88కి పడిపోయింది.

అపరిష్కృతంగా చైనా సరిహద్దు వివాదం: రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్: లడాఖ్‌లో ఉన్న పరిస్థితిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ ల

కరోనా సమస్యలపై చర్చ ఎజెండా కావాలి !

నేటినిజం
బుధవారం 16-9-2020

పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. సాధారణంగానే అనేకానేక సమస్యలపై చర్చలకు ఇప్పుడే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. ప్రధానంగా కరోనా నేపథ్యంలో సరిహద్దుల్లో చైనా దుస్సాహసానికి పాల్పడుతోంది. మన సైన్యం ప్రాణాలకు తెగించి కొండల్లో ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. ఈ దశలో సైన్యానికి యావత్ దేశం మద్దతుగా నిలవాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. అదే సందర్భంలో కరోనా బాధిత భారత ప్రజలకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీనికి అనుగుణంగా తీసుకుం టున్న చర్యలు ఏ ఒక్కరినీ ఆదుకోలేక పోతున్నాయి. ఇలాంటి సందర్భంలో పార్లమెంట్ ఉభయ సభల్లో కరోనా సమస్యలపై చర్చించి,ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలకు శ్రీకారం చుట్టాలి. ఆరు నెలలుగా ప్రజలు నానాయాతన పడుతున్న వేళ అధికార,విపక్షం అన్న తేడా లేకుండా పార్లమెంట్ సమస్యలను ఆమూలాగ్రం చర్చించి..దేశాన్ని ఆర్థిక గండం నుంచి గట్టెక్కించాల్సి ఉంది. కరోనా మహమ్మారి వ్యాప్తితో దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. కరోనా వ్యాప్తి కాలంలోఅతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ కుదేలయ్యింది. భారతదేశం ఆర్థిక వ్యవస్థగా ప్రపంచస్థాయి గుర్తింపు సంపాదించుకుంది. అయితే కరోనా పిడుగుతో మన దేశ ఆర్థికవ్యవస్థ అద్వాన్నమైన స్థితిలో ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి 20 శాతానికి పైగా క్షీణించింది. అసంఘటిత వస్తూత్పత్తులు అంతకంటే ఎక్కువగానే క్షీణించాయని క్షేత్ర స్థాయి నివేదికలు తెలియజేస్తున్నాయి. వస్తూత్పత్తి, సేవలకు చెందిన అనేక సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఇప్పటికీ మూతపడి ఉన్నాయి. కొన్ని సంస్థలు మాత్రమే నిర్వహణలో ఉన్నాయి. ఉపాధి క్షీణత, వేతనాల రేటు తగ్గుదల వలనే వేతన ఆదాయాలు జీడీపీ కంటే వేగంగా పడిపోయాయి.వ్యవసాయ రంగం మినహా ప్రతీ రంగం, ముఖ్యంగా ఎక్కువ ఉపాధిని కల్పించే రంగాలు కరోనాకన్నా వేగంగా క్షీణించాయి. రబీ సీజన్లో అనుకూలమైన రుతుపవనాలు, మంచి పంట దిగుబడులు వ్యవసాయ రంగంలో కొంత ఉపశమ నాన్ని కలుగజేయడం మినహా ప్రభుత్వ పరంగా ఉదార చర్యలు తీసుకోవడం లేదు. ఈ దశలో పార్లమెంట్ సభ్యులు ఉమ్మడి కార్యాచరణగా వివిధ రంగాల్లో కరోనా ప్రభావాలను చర్చించి, ప్రజలపై పడ్డ భారాన్ని, ప్రభావాన్ని చర్చించాలి. అందుకు ఆయా పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించి ఉపశమన చర్యలకు ప్రభుత్వాన్ని ఒప్పించాలి. ప్రతి సగటుజీవి ఆదాయాలు తగ్గాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా పొందలేక పోవడం వల్ల సంవత్సర కాలంలో రైతులు ఆశించిన స్థాయిలో ఫలితాలు పొందలేదు. ప్రభుత్వ పెట్టుబడి కూడా తగ్గుతుంది. ప్రభుత్వ పరిపాలన, రక్షణ, ఇతర సేవలరంగాల్లో కూడా చేరిన స్థూల విలువ 10 శాతానికి పైగా తగ్గింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పడుతున్నది. అనేక రాష్ట్రాల్లో జీతాల చెల్లింపుల్లో ఆలస్యం చేయడం లేదా జీతాలు స్తంభింపచేయ డం జరుగుతు ంది. ఈ క్రమంలో జిఎస్టీ ఆదాయాలు కూడా కేంద్రం చెల్లించడం లేదు. కరోనాతో ఈ చెల్లింపులు ఆపారు. యధారాజా తథా ప్రజా అన్న చందంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారం మోపుతున్నాయే తప్ప..ఉపశమన చర్యలు తీసుకోవడం లేదు. ఈ క్రమంలో కరోనా మహమ్మారి అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతునే ఉంది. దీనిని కట్టడి చేయాలన్న విషయంలో ప్రభుత్వాలు చేతులెత్తేశాయి. కరోనా వ్యాప్తికి ముందు పరీక్షించడం, గుర్తించడం, ఐసొలేషన్లో ఉంచడం, చికిత్సను అందించడం వంటి చర్యలు ఇప్పుడు కానరావడం లేదు. జీవనాధారాలను కోల్పోయిన 80 శాతం మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఏ విధమైన నష్టపరిహారాన్ని గానీ, సామాజిక రక్షణను గానీ సమకూర్చలేదు. వలస కార్మికులను తమ తమ స్వస్థలాలకు తిరిగి వెళ్ళమని ఒత్తిడి చేసి అత్యంత భయానకమైన పరిస్థితుల్లో వారిని నెట్టారు. స్వస్థలాలకు తిరిగి వెళ్ళిన వలస కార్మికులు అక్కడ ఉన్న దయనీయమైన ఆరోగ్య పరిస్థితుల కారణంగా...గ్రామీణ ప్రాంతాల్లో తమకు తెలియకుండానే ఈ వ్యాధిని వ్యాపింపచేశారు. అక్కడ తగినంత ఆహారాన్ని పొందలేక పోవడం, పౌష్టికాహార లోపాల కారణంగా...శ్రామిక ప్రజలు కడుపేదవారుగా, దుర్భలులుగా మారిపోయారు. కరోనా వ్యాధి ప్రమాదకరమైన పరిస్థితులను పెంచుతున్న ఈ తరుణంలో కూడా తక్కువ వేతనాలకు పని చేయడానికి తిరిగి రమ్మని వలస కార్మికులను ఇప్పుడు మళ్ళీ ఒత్తిడి చేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ, వైద్య విధానాలకు సంబంధించి ప్రభుత్వ వ్యూహంలో మార్పు రాకపోతే...ఈ భయంకరమైన పరిస్థితి ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే అందుకు విపక్షాలు కూడా బాధ్యత వహించాలి. కరోనా వైరస్ మహ మ్మారి వ్యాప్తి కారణంగా వినియోగం, పెట్టుబడులు క్షీణిస్తూ వచ్చాయి. ఆర్థిక వ్యవస్థ పెద్ద ఎత్తున పతనం అవుతోంది. ప్రభుత్వం నుంచి అందిన సహాయక చర్యలు చాలా తక్కువగా ఉండడం దయనీయమైన విషయం. మిలియన్ల సంఖ్యలో ప్రజలు బాధలకు గురైతే...అతి కష్టం మీద వందల సంఖ్య లోని ప్రజలకు మాత్రమే సహాయం చేరింది. బ్యాంక్ రుణాలు ఇవ్వడం మొత్తంగానే తగ్గింది. అన్ని రకాల రుణగ్రస్థులకు బ్యాంక్‌ల నుండి చాలా తక్కువ రుణాలు మాత్రమే అందాయి. దీనికితోడు ఇఎంఐలపై వడ్డీల వసూళ్లు ఆపడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేదు. కరోనా మహమ్మారి వ్యాప్తి కారణంగా ఆర్థిక వ్యవస్థలో సంభవించిన పరిణామాలను, ఆరోగ్య సంక్షోభాలను నిరోధించే భారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలే మోయాలని కేంద్రం ఒత్తిడి చేస్తోంది. ఈ నిర్వహణకు అవసరమైన వనరులను సమకూర్చేం దుకు కేంద్రం నిరాకరించింది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆఖరికి రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయబద్ధంగా చెల్లించవలసిన వస్తు, సేవల పన్ను జిఎస్‌టి నష్ట పరిహారాన్ని కూడా నిరాకరిస్తోంది. ఈ దశలో పార్లమెంట్ ప్రజలకు జవాబుదారీగా మారాలి. సమస్యలను చర్చించాలి. ఊకదంపుడు ఉపన్యాసాలకు పోకుండా సానుకూల నిర్ణయాలకు ముందుకు రావాలి. విపక్షాలు ఎజెండాను ముందు పెట్టి చర్చకు ఉపక్రమించడం ద్వారా భారత్‌ను కాపాడుకోవాలి.

ఛత్రపతి శివాజీ పేరే ఎందుకు?

యోగి నిర్ణయంపై పలుప్రశ్నలు

లక్నో,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): ఆగ్రాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ముఘల్ మ్యూజియం ఇకనుంచి ఛత్రపతి శివాజీ పేరుతో వాసికెక్కనుంది. గత ప్రభుత్వ హయాంలో దీనికి మొఘలుల పేరు పెట్టగా తాజాగా దీనిపేరును మార్చారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అధికారికంగా ప్రకటించారు. మొఘలులు మన హీరోలు ఎలా అవుతారంటూ ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. అయితే యూపిలో అనేకమంది సమరయోధులు ఉన్నారని, పేరొందిన నేతల ఉన్నారని వారిపేరుమీద ప్రకటిస్తే బాగుండేదని అంటున్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారు. లొంగుబాటు మనస్తత్వాన్ని సూచించే దేన్నైనా తన ప్రభుత్వం తొలగిస్తుందని సీఎం యోగీ తేల్చి చెప్పారు. ఆగ్రాలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మ్యూజియంను ఇక ఛత్రపతి శివాజీ మహారాజ్ పేరుతో పిలవాలి. ఈ కొత్త ఉత్తరప్రదేశ్‌లో బానిస మనస్తత్వాన్ని సూచించే చిహ్నాలకు స్థానం లేదు. శివాజీ మహారాజ్‌యే మన హీరో..జై హింద్.. జై భారత్' అని ఆయన ట్వీట్ చేశారు. 2015లో అప్పటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ ముఘల్ మ్యూజియం నిర్మించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. తాజ్‌మహల్‌కు సమీపంలోని ఆరు ఎకరాల స్థలంలో దీన్ని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ముఘలుల సంస్కృతి, కళా రీతులు, చిత్రాలు, ఆయుధాలు, వంటి వాటికి ఈ మ్యూజియం పెద్ద పీట్ వేసేందుకు నిర్ణయించింది. ఇక ముఘలతో జరిపిన భీకర పోరాటాలకు మహారాష్ట్ర వీరాగ్రేసరుడు ఛత్రపతి శివాజీ పేరు గాంచారు. ఆయన తన జీవితంలో అధికభాగం వారిపై యుద్ధం చేస్తూనే గడిపారు.

సైన్యానికి అండగా దేశం మద్దతు

సమావేశాల ద్వారా సంకేతం ఇవ్వాలి: ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ):యావత్ దేశం సైనికుల వెంట నిలిచి ఉందన్న సంకేతాన్ని పార్లమెంట్ ఇవ్వాలని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షాకాలా సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పార్లమెంట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. చాలా భిన్నమైన సమయంలో పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఒకవైపు కరోనా, మరో వైపు విధి నిర్వహణ ఉందని, కానీ ఎంపీలంతా తమ డ్యూటీకే ప్రాధాన్యత ఇచ్చారని, ఎంపీలందరికీ తాను కంగ్రాట్స్ చెబుతున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. రాజ్యసభ, లోక్‌సభలు రెండు వేరువేరు సమయాల్లో జరుగుతాయని, శని-ఆదివారాల్లోనూ సమావేశాలు ఉంటాయని, దీనికి ఎంపీలందరూ ఆమోదం తెలిపినట్లు మోదీ చెప్పారు. నోవల్ కరోనా వైరస్‌కు మందు రానంత వరకు నిర్లక్ష్యం వద్దు అంటూ మోదీ మరోసారి స్పష్టమైన సందేశం ఇచ్చారు. కరోనా వైరస్‌కు వీలైనంత త్వరగా వ్యాక్సిన్ వస్తే బాగుంటుందన్నారు. మన శాస్త్రవేత్తలు కూడా వ్యాక్సిన్ తయారీలో సక్సెస్ సాధించినట్లు మోదీ తెలిపారు. ఇక చైనాతో నెలకొన్న సరిహద్దు అంశాన్ని కూడా మోదీ ప్రస్తావించారు. యావత్ దేశం మొత్తం సైనికుల వెంటే ఉందన్న సంకేతాన్ని పార్లమెంట్ సభ్యులు వినిపిస్తారని భావిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

హరివంశ్‌కు అభినందనలు

రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన హరివంశ్ నారాయణ్ సింగ్‌కు ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని స్పందిస్తూ... హరివంశ్ పట్ల తనకున్న గౌరవ భావమే సభలోని ప్రతి

సభ్యుడు కలిగి ఉన్నాడన్నారు. ఆయన ఈ గౌరవాన్ని సంపాదించినట్లు తెలిపారు. పార్లమెంటు సమావేశాల నిర్వహణలో హరివంశ్ ప్రదర్శించే నిష్పాక్షిక పాత్ర మన ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తుందని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉత్పాదకతను, సానుకూలతను పెంపొందించేందుకు ఆయన ప్రయత్నాలు చేశారన్నారు. ప్రజాస్వామ్య విలువలకు పెరుగాంచిన బిహార్ నుంచి వచ్చిన ప్రజాస్వామ్య టార్చ్ బేరర్ హరివంశ్ అని ప్రధాని కొనియాడారు.

డిగ్రీ ఆన్‌లైన్ పరీక్షలపై స్పష్టత ఇవ్వండి

-ప్రభుత్వానికి హైకోర్టు సూచన

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): డిగ్రీ, పీజీ చివరి సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై హైకోర్టులో విచారణ జరిగింది. చివరి సెమిస్టర్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని పిటిషనర్లు కోరారు. ఆన్‌లైన్‌లో చివరి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం వీలుకాదని ప్రభుత్వం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సమస్య తలెత్తుతుందని పేర్కొంది. పరీక్షలు రాయలేని విద్యార్థులు సప్లిమెంటరీ రాయవచ్చని, సప్లిమెంటరీలో పాసైనా రెగ్యులర్‌గా పరిగణిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అటానమస్ కాలేజీలకు మాత్రమే ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు అనుమతిచ్చినట్లు స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో మాత్రమే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తామని ఓయూ తెలిపింది. మరోవైపు ఆన్‌లైన్‌లో మిడ్‌టర్మ్, ఆఫ్‌లైన్‌లో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని జేఎన్టీయూ వెల్లడించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానం గందరగోళంగా కనిపిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ఏదో ఒక విధానం ఉండాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు సూచించింది. డిగ్రీ, పీజీ చివరి సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై హైకోర్టులో విచారణ ముగిసింది. చివరి సెమిస్టర్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ, ఇతర పిటిషనర్లు కోరారు. అయితే ఆన్‌లైన్‌లో చివరి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించడం వీలు కాదన్న ప్రభుత్వం.. గ్రామీణ ప్రాంతాల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సమస్య తలెత్తుతుందని కోర్టుకు తెలిపింది. ఈ మేరకు హైకోర్టు స్పష్టత ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను నేటికి వాయిదా వేసింది.

హరివంశ్‌ను అభినందించిన విజయసాయి

న్యూఢిల్లీ,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): ఉప సభాపతిగా ఎన్నికైనా హరివంశ్ నారాయణ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ సభ్యులు విజయసాయిరెడ్డి అభినందనలు తెలిపారు. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా సోమవారం హరివంశ్ నారాయణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు రాజకీయ నాయకులు, రాజ్యసభ సభ్యులు శుభకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో విజయసాయి రెడ్డి కూడా ఆయనకు శుభకాంక్షలు తెలిపారు. అధికార, విపక్షాలకు మధ్య సమతుల్యం పాటించినప్పుడే చైర్మన్, డిప్యూటీ చైర్మన్‌గా విజయవంతం అవుతారని విజయసాయిరెడ్డి అన్నారు. గతంలోనూ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ ఎన్నికయ్యారని, వైఎస్సార్ సీపీ లాంటి ప్రాంతీయ పార్టీలకు ఆయన మంచి సమయం కేటాయించారని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

దుబ్బాకలో రాజుకుంటున్న ఉప ఎన్నిక వేడి

అన్ని పార్టీలు రంగంలోకి దిగే ఛాన్స్

బరిలోకి సోలిపేట సతీమణి సుజాత

టిఆర్ఎస్ గెలుపు సునాయసమే అంటున్న స్థానికులు

సిద్ధిపేట,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉపఎన్నిక వేడి రాజుకుంటోంది. అన్ని పార్టీలు పోటీకి సిద్ధం అంటూ ప్రకటించగా తాజాగా దుబ్బాక అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి సతీమణి సుజాత బరిలో నిలవనున్నారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖంరావు త్వరలోనే అధికారిక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. మరోవైపు ఇక్కడ ఎవరు పోటీచేసినా లక్ష ఓట్లతో గెలుస్తామన్న భరోసాలో అధికార పార్టీ ఉంది. ఇప్పిటికే అక్కడ అన్ని పార్టీల నేతలు ప్రచారంలోకి దిగాయి. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు పోటీకి సిద్ధపడుతున్నాయి. బిజెపి నుంచి మరోమారు రఘునందన్ రావు పోటీపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సోలిపేట రామలింగారెడ్డి హఠాన్మరణంతో దుబ్బాక శాసనసభ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో చెరుకు ముత్యంరెడ్డి చనిపోయిన సందర్భంలో ఆయన కుటుంబానికి బాసటగా ఉంటానని, రాజకీయంగా ఆదుకుంటామని కేసీఆర్ అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ తర్వాత సోలిపేట రామలింగారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచి అంచనాల కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్న సందర్భంలోనే, ఆయన అకాల మృతి నేపథ్యంలో సోలిపేట కుటుంబానికి కూడా హామీ ఇచ్చారు. దీంతో ఇరువురు నేతల తనయులు టిఆర్ఎస్ పార్టీ నుంచి టికెట్ ఆశించగా.. చివరికి సోలిపేట సతీమణి సుజాతకు అవకాశం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇకపోతే ఉప ఎన్నికకు ముందు ఇక్కడ పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కాగా ఎమ్మెల్యే అభ్యర్థిగా సుజాత పేరు ఏకగ్రీవం కావడంతో దుబ్బాక, సిద్ధిపేటలో సోలిపేట కుటుంబ అనుచర వర్గం సంబరాలు చేసుకుంటోంది. మరోవైపు.. టికెట్ ఆశించి భంగపడి. అసంతృప్తితో ఉన్న చెరకు ముత్యరెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డితో టీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు మంతనాలు జరుపుతున్నారు. మొత్తంగా దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికపై టీఆర్ఎస్ దృష్టి సారించింది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి మరణంతో దుబ్బాక అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సిన అనివార్యత ఏర్పడింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దుబ్బాక ఉప ఎన్నిక షెడ్యూలు వెలువడుతుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సెప్టెంబర్ మూడోవారంలో ఎన్నికల షెడ్యూలు రావచ్చని భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి భార్య సుజాతకు దాదాపు ఖాయమనే ప్రచారం జరుగుతోంది. జర్నలిస్టుగా పనిచేసిన రామలింగారెడ్డి 2004, 2008లో దొమ్మాట నుంచి, 2009, 2014, 2018 ఎన్నికల్లో దుబ్బాక నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. 2009 మినహా అన్ని ఎన్నికల్లోనూ రామలింగారెడ్డి గెలుపొందారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట నియోజకవర్గాలకు దుబ్బాక పొరుగునే ఉంది. మంత్రి హరీష్‌రావు దుబ్బాక నియోజకవర్గంలో మండలాలవారీగా విస్తృతంగా పర్యటించి కార్యకర్తలతో భేటీ అయ్యారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ, చెరువుల్లో చేపలు వదలడం వంటి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ కేడర్ చెక్కుచెదరకుండా చూడటంతోపాటు అసంతృప్తుల బుజ్జగింపు, ఇతర పార్టీల నుంచి చేరికలు తదితరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పావులు కదుపుతున్నారు. ఉప ఎన్నికల్లో తనకు కేసీఆర్ ఎక్కడ బాధ్యత అప్పగించినా గెలిపించిన విషయాన్ని గుర్తు చేస్తూ కార్యకర్తల్లో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు.

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో భారీ వర్షాలు

వరదనీటితో ప్రాజెక్టులకు జలకళ

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో సోమవారం రాత్రి నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అల్పపీడనం ఏర్పడింది. ఇది ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశ వైపునకు వంపు తిరిగి ఉన్నది. ఇది మరింత బలపడడంతో భారీ ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల, పెద్దపల్లి, కామారెడ్డి, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్ అర్బన్, రూరల్, జనగాం, నల్గొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అక్కడక్కడ ఉరుములు, పిడుగులతో వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పింది. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. నాగార్జునసాగర్,జూరాల, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సహా అనేక చెరువులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు పొంగి మత్తళ్లు పోస్తున్నాయి. కృష్ణా నదికి వరద పెరిగింది. ఎగువ నుంచి, నదీ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరద వస్తోంది. ఇప్పటికే డ్యామ్ పూర్తిస్థాయిలో నీటితో నిండుకుంది. దీంతో వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. జూరాల నుంచి శ్రీశైలానికి లక్షా 37 వేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో వస్తుండటం.. ఇప్పటికే శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయిలో నిండటంతో డ్యామ్ 9 క్రస్టు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2 లక్షల 80 వేల క్యూసెక్కులకుపైగా స్పిల్ వే ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.58 అడుగులు టీఎంసీలుగా ఉంది. నాగార్జున సాగర్ జలాశయం సైతం పూర్తిగా నిండటంతో 14 క్రస్టుగేట్లను ఎత్తి 2 లక్షల దిగువ పులిచింతలకు విడుదల చేస్తున్నారు. కుడికాల్వ, ఎల్ఎల్‌బీసీ, వరద కాల్వ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 39 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.90 అడుగులుగా ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని వదలడంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ముందస్తుగా హెచ్చరికలు జారీ చేశారు. గోదావరి నదిలో చేపలు పట్టకూడదని, అటుగా ఎవరూ వెళ్లకూడదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన దృష్ట్యా సందర్శకులు ఎవరూ ప్రాజెక్ట్ వద్దకు రావద్దని నిషేధం విధించారు. కరోనా వైరస్ ప్రభావంతో సందర్శకులకు అనుమతి లేదని ప్రకటించారు. గోదావరికి భారీగా వరద పెరుగుతోంది. ఎగువ నుంచి కురుస్తున్న వర్షాలకు వరద వస్తుండడంతో శ్రీరాంసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో అధికారులు 16 గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 1,091 అడుగులు కాగా పూరిస్థాయిలో నిండింది. నీటి నిల్వ సామర్థ్యం 90.31 టీఎంసీలు, ప్రస్తుతం నిల్వ 90.31 టీఎంసీలు ఉంది. జలాశయం గరిష్ఠ మట్టానికి చేరుకోవడంతో అధికారులు 16 గేట్లు ఎత్తి 50వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. అలాగే వరద కాలువ ద్వారా దిగువ మానేరులోకి సైతం నీటిని తరలిస్తున్నారు. జగిత్యాల జిల్లా వేడివల్లలో భారీ వర్షాపాతం నమోదైంది. అలాగే పలు మండలాల్లోనూ వర్షం కురిసింది. వానకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. అనంతారం వాగుపై నుంచి నీరు ప్రవహించడంతో జగిత్యాల-ధర్మపురి మధ్య, చల్‌గల్ వద్ద ఒర్రె ఉధృతంగా పారడంతో జగిత్యాల-రాయికల్ మధ్య, గుల్లపేట-పొలాస మధ్య వంతెనపై నుంచి నీళ్లు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. కామారెడ్డి జిల్లాలో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా నాగిరెడ్డిపేటలో 118.5 మి.మీ వర్షాపాతం నమోదైంది. పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బోయినపల్లిలో భారీవర్షం కురిసింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్ అర్బన్‌తో పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి.

ధర్మపురికి నిలిచిన రాకపోకలు

జగిత్యాల జిల్లాలోని గోవింద్ పల్లిలో భారీగా వర్షం కురిసింది. దీంతో ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. భారీగా కురిసిన వర్షానికి కార్లు, పశువులు నీటిలో కొట్టుకుపోయాయి. చుట్టు పక్కన ఉన్న చెరువులకు గండి పడింది. దీంతో జగిత్యాల, ధర్మపురికి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వర్షాలకు పంటలు నీట మునగగా...కాలువలు, చెరువులకు గండ్లుపడ్డాయి.

పేదింటి యువతుల పెద్దన్న సీఎం కేసీఆర్ : ప్రభుత్వ విప్ గాంధీ

హైదరాబాద్, సెప్టెంబర్ 15: పేదింటి ఆడపిల్లలకు పెద్దన్నగా మారి సీఎం కేసీఆర్ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో భరోసాగా నిలుస్తున్నారని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వివేకానందనగర్‌లోని తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ..ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈపథకంతో పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆసరాగా మారుతుందన్నారు.

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోవర్ధన్, వీఆర్‌వో యాదగిరి, దన్‌రాజ్, గంధం రాములు, టీఆర్ఎస్ నాయకులు శ

వర్షాలపై అప్రమత్తం అయిన అధికారులు

గుంటూరు కలెక్టరేట్‌లో అత్యవసవసర సేవాకేంద్రం ఏర్పాటు
నీట మునిగిన పంటలతో రైతుల ఆందోళన

గుంటూరు,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలో భారీగా కురిసిన వర్షాలకు వివిధ రకాల పంటలు మునిగిపోయాయి. భారీ వర్షాలకు సుమారు పదివేల ఎకరాల్లోని పంటలు మునిగిపోయినట్లు అధికారులు అంచనా వేశారు. వరదలు, భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారు లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్‌కుమార్ ఆదేశాలిచ్చారు. గురజాల, తెనాలి, గుంటూరు ఆర్డీవో కార్యాల యాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో అత్యవసర సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లంక గ్రామాల్లో పసుపు, కంద, అరటి తోటల్లో వర్షపు నీరు నిలిచింది. వర్షం ధాటికి మినుము పైరు దెబ్బతింటా యని రైతులు ఆందోళన చెందు తున్నారు. ఒక వైపు వర్షాలు, మరోవైపు కృష్ణానదిలో వస్తున్న వరద ప్రవాహంతో లంక గ్రామాల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు, అమరావతి మండలం మద్దూరు, లింగాపురం, పెదకూరపాడు మండలం హుస్సేన్ నగర్, పాటిబండ్ల, లగడపాడు, పరస, తదితర ప్రాం తాల్లో చెరువులు తెగాయి. పల్నాడులోని పలు వాగులు పొంగిపొర్లుతున్నాయి. పల్నాడు, డెల్లా ప్రాం తాల్లోని పలు ప్రాంతాల్లో వేసిన పత్తి, మిర్చి, వరి పంటలు నీట మునిగి పోయాయి. పెదకూరపాడు, మేడికొండూరు, గుంటూరు, సత్తెనపల్లి,అమరావతిలో భారీ వర్షం కురిసింది. పిడుగురాళ్ల, దాచేపల్లి పట్టణంలో లోతట్టు ప్రాంతాల తోపాటు ప్రధాన రహదారులన్నీ వర్షపునీటితో మునిగి పోయాయి. అద్దంకి- నార్కెట్‌పల్లి రహదారిపై, రాళ్ల వాగు, నాగులేరు, నల్లవాగు, రాళ్లవాగు, కంజుల వాగులు ఉధృ తంగా ప్రవహించటంతో రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. సాగర్, పులిచింతల ప్రాజెక్టు నుంచి పెద్దఎత్తున కిందకి సాగునీరు విడుదల చేస్తున్నారు. గురజాల, మాచవరం మండలాల్లోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నత్తెనపల్లిలోని నాగన్నకుంట, సుందరయ్యకాలనీ, శాలివాహననగర్, ఎస్‌బీజీ పీజీకాలేజ్ ఏరియా, యానాది కాలనీ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. సత్తెనపల్లి నుంచి మాచర్ల వెళ్లే మార్గంలోని వెన్నాదేవి వద్ద ఉన్న అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాలను దారి మళ్లించారు. ఎడ్డు వాగు పక్కనున్న పొలాలను వరదనీరు ముంచెత్తింది. సత్తెనపల్లి మండలంలో భారీ వర్షపాతం నమైదైనట్లు అధికారులు చెప్పారు. రెంటచింతల మండలంలోని పాలువాయి, పిల్లివాగు, గోలి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తాడికొండలోని ప్రధాన రహదారి, కొండవీటి వాగు, పొన్నెకల్లు -దామరపల్లి మధ్యలోని చఎ÷-టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. క్రోసూరు రోడ్డులోని ముత్తాయపాలెం దిడుగు గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు రాకపోకలు నిలిపివేశారు. ధరణికోట, ముత్తాయ పాలెం గ్రామాలలో వరదనీరు చేరింది. పెదకూరపాడు మండలంలోని పాటిబండ్ల, 75 తాళ్ళూరు, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో చెరువులకు గండి పడి ఇళ్లలోకి నీరు చేరింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పెదకూరపాడు, అమరావతి వెళ్ళే ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెదకూరపాడు, నీరుకుంట, పరస, బలుసుపాడు గ్రామాల్లోని చఎ÷-టాలు పూర్తి స్థాయిలో నీట మునిగిపోయాయి.

అన్ని హంగులతో మార్కెట్ నిర్మాణం

గజ్వేల్ తరహాలో నిర్మాణానికి ప్రణాళిక
మేయర్ సునీల్ రావు ప్రకటన

కరీంనగర్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): నగర ప్రజలకు మౌలిక సదుపాయాలతోపాటు కూరగాయల మార్కెట్ త్వరలోనే అందుబాటులోకి రానుందని మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. అన్ని హంగులతో నగర నడిబొడ్డున మూడెకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేందుకు 14 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందన్నారు. గజ్వేల్ తరహాలో ఇక్కడా నిర్మిస్తామని అన్నారు. పార్కులు, క్రీడా మైదానాలు, వాకింగ్ ట్రాక్స్, పబ్లిక్ టాయిలెట్ల వంటి సౌకర్యాలను కల్పించి స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేసేందుకు నగరపాలక సంస్థ ప్రతిపాదనలను సిద్ధం చేసిందన్నారు. ఇందులో భాగంగా త్వరలోనే టెండర్లను నిర్వహించి పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలు, మంత్రులు కేటీ రామారావు, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సహకారంతో వీలైనంత త్వరగా మార్కెట్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తామని మేయర్ అన్నారు. స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్న కరీంనగర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి నగరపాలక సంస్థ కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్‌కు చేరువలోని ఆర్‌అండ్‌బీశాఖకు సంబంధించిన స్థలంలో వెజ్, నాన్‌వెజ్‌తో పాటు ఇతర వ్యాపార సముదాయాలను ఆధునిక హంగులతో నిర్మించేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందించామని అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను నిర్మించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కె.శశాంక, మేయర్ వై.సునీల్‌రావు, కమిషనర్ వల్లూరి క్రాంతి సందర్శించి అదే తరహాలో ఇక్కడ మార్కెట్‌కు ప్రతిపాదనలను తయారు చేశారు. స్థలం ఎంపిక, నిధుల కేటాయింపులు పూర్తి కావడంతో మార్కెట్ నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలోనే ఉన్న ప్రధాన కూరగాయల మార్కెట్‌కు రద్దీ పెరిగింది. మార్కెట్ ఆవరణతోపాటు అన్నపూర్ణ కాంప్లెక్సు, టవర్‌సర్కిల్, ప్రకాశం గంజ్ రోడ్డు, శాస్త్రీరోడ్డు, వేంకటేశ్వరస్వామి ఆలయం, తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు రోడ్లను ఆక్రమించుకొని వ్యాపారులు కూరగాయలు, పండ్లు, విక్రయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నది. పండుగ సందర్భాల్లో ఆ ప్రాంతం నుంచి వెళ్ళడమే కష్టమవుతుంది. రోడ్లపై ఆక్రమణలను తరచూ తొలగిస్తున్నా ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించకపోవడంతో మళ్లీ దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించారు.

శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శుద్ధి కార్యక్రమం

తిరుమల,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి ఏడాది కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఏడాదికి నాలుగు సార్లు నిర్వహిస్తారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఆనంద నిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ప్రసాదాల పోటు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పుతోపాటు పూజా సామగ్రిని శుద్ధి చేసినట్టు తెలిపారు. కాగా, ఆలయంలో ఉదయం 6గంటల నుంచి 9 గంటల వరకు శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి వేశారు. శుద్ధి పూర్తి అయిన అనంతరం నామకోపు, శ్రీ చూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమజనంలో ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అధికమాసం సందర్భంగా అక్టోబర్ 16 నుంచి 24వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కొవిడ్-19 నిబంధనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం.. టీటీడీ ధర్మకర్తల మండలి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహించాలని తీర్మానం చేసినట్లు చెప్పారు. ఇందు కోసం జీయర్ స్వాములు, ఆగమ సలహదారులు, ప్రధాన అర్చకులతో చర్చించి సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఉత్సవాల ఏర్పాట్లపై చైర్మన్ సుబ్బారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించుకొని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం దాదాపు 12వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నార న్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏకాంతంగా జరిగే వాహన సేవలను ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందని చెప్పారు. బ్రహ్మోత్స వాల సందర్భంగా 23న గరుడసేవ రోజున ప్రభుత్వం తరఫున సీఎం జగన్ పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ ఏఈవో ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్, ఎస్వీబీసీ సీఈవో సురేష్ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించిన దృశ్యం

ప్రత్యేకహోదాపై పార్లమెంట్‌లో పోరాడండి

జీఎస్టీ బకాయిలు, కేంద్ర పథకాల నిధులను రాబట్టాలి
పోలవరం ప్రాజెక్ట్‌కు నిధుల సాధనకు కృషి చేయాలి
ఎంపిలతో సిఎం జగన్ వర్చువల్ మీటింగ్
పార్లమెంట్ అజెండాపై ఎంపిలకు దిశానిర్దేశం

అమరావతి,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని పార్లమెంటలో చర్చకు తీసుకురావాలని వైకాపా ఎంపిలకు సిఎం జగన్ సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలు, కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులతో పాటు పోలవరం ప్రాజెక్ట్‌కు నిధుల సాధనకు పోరాడాలని అన్నారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సభలో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో వర్చువల్ మీటింగ్ ఏర్పాటు చేశారు. సమావేశంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్ట్‌ల సాధనపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. అన్ని ఫార్మాట్ల అవకాశాలను పార్లమెంట్‌లో వినియోగించుకునేలా ఎంపీలకు సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే బీఏసీ సమావేశంలో ఏపీకి సంబంధించిన కరోనా నియంత్రణ చర్యలు, రాష్ట్రాలకు రావాల్సిన జీఎస్టీ నిధుల వంటి అంశాలపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి స్పీకర్‌ను కోరిన సంగతి తెలిసిందే.

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేసినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత మిథున్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంతో జరిగిన సమావేశంలో ప్రత్యేక హోదా గురించి మాట్లాడాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టు బకాయిలు కేంద్రం నుంచి వచ్చేలా చూడమని చెప్పారు. నిర్వాసితులకు నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చేలా ఒత్తిడి చేయమని కోరారు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేశాము. ఈ అంశంపై త్వరలోనే కేంద్ర మంత్రులను కలుస్తాము. జీఎస్టీ పెండింగ్ బకాయిలను వచ్చేలా అధికారులతో కలుస్తాం. గరీబ్ కళ్యాణ్ కింద నిధులు వచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. జనాభా ప్రాతిపదికన ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఓ మెడికల్ కాలేజ్ పెట్టేలా సీఎం నిర్ణయం తీసుకున్నారు. మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్రం మద్దతు కోరారు. సాలూరులో గిరిజన విశ్వవిద్యాలయం ఉంటే గిరిజనులకు లాభం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంపై లేనిపోని నిందలు వేస్తున్నారు. అంతర్వేది ఘటనపై నిజాలు నిగ్గు తేలాలి. మతకలహాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. దోషులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం. సీఆర్‌డీఏ, ఫైబర్ గ్రిడ్‌లపై వెంటనే సీబీఐ దర్యాప్తు జరపాలన్నారు. దిశా బిల్లు, కౌన్సిల్ రద్దు బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉందని మిథున్ రెడ్డి చెప్పారు.

రఘురామపై వేటుకు డిమాండ్

రఘురామకృష్ణంరాజుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తి గౌరవం ఇచ్చింది. అయితే ఆయన ప్రతిపక్షాల ఎజెండా ప్రకారం నడుచుకుంటున్నారు. ఆయనపై త్వరితగతిన అనర్హత వేటు వేయాలని మిథున్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీ రఘురామకృష్ణరాజు పూర్తిగా ప్రతిపక్ష ప్రభావంలో ఉన్నారని, స్పీకర్‌ను కలిసి ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతామని వైసీపీ ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డి తెలిపారు. వైసీపీ ఎంపీలతో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మిథున్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకహోదా, పోలవరం నిధులు, ఆర్ ఎండ్ ఆర్ ప్యాకేజి నిధులు కోరుతామని తెలిపారు. జీఎస్టీ, సివిల్ సప్లయ్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కేంద్ర సాయం కోరుతామని చెప్పారు. ప్రతిపక్షాలు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నాయని, రథం విషయంలో మతకలహాలు సృష్టించేలా మాట్లాడుతున్నారని మిథున్‌రెడ్డి తప్పుబట్టారు.

భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు

-ప్రకాశ్ బ్యారేజి వద్ద పోటెత్తిన కృష్ణమ్మ

విజయవాడ,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): ఎపిలో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లో నష్టం భారీగా ఉంది. విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. ప్రస్తుతం బ్యారేజ్ ఇన్‌ఫ్లో 2 లక్షల 90వేల క్యూసెక్కులుగా, అవుట్ ఫ్లో 2 లక్షల 82వేల క్యూసెక్కులుగా ఉంది. డెల్టా సాగు తాగునీటి అవసరాల కోసం కృష్ణ తూర్పు, పడమర కాలువలకు 4 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. వరద ప్రవాహం నేపథ్యంలో అధికారులు ప్రకాశం బ్యారేజ్ 70 గేట్లు నాలుగు అడుగులు మేరకు ఎత్తి నీటి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం వద్ద ఎర్రకాల్వ రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు నాలుగు గేట్లు ద్వారా 6500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్ ఇన్ ఎ÷-లో 11 వేలు క్యూసెక్కులుగా ఉంది. దీంతో అప్రమత్తమైన అధికారులు సాయంత్రం లోపు అన్ని గేట్లు ఎత్తే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం వద్ద చిగడవాగును దాటు ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గత రాత్రి పేదగర్ల శ్యాంబాబు(35) అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై వాగును దాటేందుకు యత్నించాడు. ఈ క్రమంలో వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఆ వ్యక్తి గల్లంతయ్యాడు. విషయం తెలిసిన పోలీసులు, అధికారులు అక్కడకు చేరుకుని శ్యాంబాబు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన వ్యక్తి పాత చింతలపూడి గ్రామవాసిగా గుర్తించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నెల్లూరు జిల్లాలో డ్యామ్‌లన్నీ జలకళను సంతరించుకున్నాయి. కండలేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం - 68.03 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 35.989 టీఎంసీలకు చేరుకుంది. ఇన్ ఎ÷-లో 10,180క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో - 70క్యూసెక్కులకు చేరుకుంది.

ప్రతిపాదిత విద్యుత్ బిల్లును పక్కన పెట్టాలి

మంచిర్యాల,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): మోదీ ప్రభుత్వం స్వదేశీ జపం చేస్తూ విదేశీ కార్పొ రేట్లకు, కంపెనీలకు రెడ్ కార్పెట్ వేస్తోందని ఖిల భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ.లాలన్‌కు మార్ విమర్శించారు. కార్పొరేట్ వ్యవసాయ విధానం, నూతన విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతిపాదిత విద్యుత్ బిల్లు రైతలకు పిడుగుపాటు లాంటిదని, దీంతో వ్యవసాయం చేసుకునే రైతులకు విద్యుత్ భారం కానుందన్నారు. అలాగే ఉచిత విద్యుత్‌కుమంగళం పాడే కుట్ర సాగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కార్పొరేట్ వ్యవసాయ విధానాన్ని, విద్యుత్ సవరణ బిల్లులను రైతులు వ్యతిరేకిస్తుంటే కేంద్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. దేశంలో తీవ్ర సంక్షోభం నెలకొని ఉన్న దృష్ట్యా ఆ భారాన్ని రైతులపై మోపడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్లు, పెట్టుబడి దారులు కొల్లగొట్టిన

బ్యాంకు సంపదను తిరిగి కట్టించుకోలేక రుణమాఫీలు చేసి వారికి అండగా నిలవడం సిగ్గుచేటన్నారు. కార్మిక చట్టాలను రోజు రోజుకు బలహీనపరుస్తూ కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వానికి చావుదెబ్బ తప్పదన్నారు.

నూతన చట్టంతో రైతులకు భరోసా

ఖమ్మం,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలుస్తున్నదని డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావు అన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రవేశపెట్టిన నూతన రెవెన్యూ చట్టం రైతులకు వరం కానుందని అన్నారు. ఇక భూములను ఇతరులు లాక్కుంటారన్న భయం లేకుండా పక్కాగా రికార్డులు ఉంటాయన్నారు. నూతన రెవెన్యూచట్టాన్ని తీసుకొచ్చిన నేపథ్యంలో సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన రెవెన్యూ చట్టంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, భూసమస్యలు, పాస్‌పుస్తకాల కోసం నెలలతరబడి రెవెన్యూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే బాధితులకు ఎంతో ఊరట

లభిస్తుందన్నారు. లంచావతారులుగా మారిన కొందరు రెవెన్యూ ఉద్యోగుల బారి నుంచి రైతులను కాపాడేందుకు సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన కొత్త రెవెన్యూ చట్టంపై ప్రజలు నుంచి సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. సీఎం కేసీఆర్.. రైతు బాంధవుడని, వ్యవసాయరంగ అభివృద్ధికి ఆయన ప్రాధాన్యమిస్తున్నారన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపండి

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని బిజెపి మరోమారు డిమాండ్ చేసింది. విమోచన దినం అధికారికంగా నిర్వహించాలని ఇప్పటికి పలు సందర్భాల్లో కోరామని తెలిపారు. తెలంగాణా విమోచన దినం అధికారికంగా నిర్వహించాలని మరోసారి విజ్ఞప్తి చేశామన్నారు. తెలంగాణా ప్రజల త్యాగాలను కేసీఆర్ విస్మరిస్తున్నారని విమర్శించారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వాళ్ల త్యాగాలు గుర్తించాలన్నారు. మజ్లీస్ పార్టీ ఒత్తిడికి లొంగి టీఆర్ఎస్ సర్కార్ విమోచన దినం నిర్వహించటం లేదని విమర్శించారు.పార్టీలుగా చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నపుడు..అధికారికంగా చేయడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ సమస్యను పట్టించుకోవటం లేదని మండిపడ్డారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌ను కోరామన్నారు.

అన్ని భారతీయ భాషలను గౌరవించుకుందాం, ప్రోత్సహిద్దాం: ఉపరాష్ట్రపతి

హైదరాబాద్, సెప్టెంబర్ 15:హిందీభాషను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని.. అలాగని ఏ భాషనూ ఎవరిపైనా రుద్దాల్సిన అవసరం లేదని, ఏ భాషనైనా వ్యతిరేకించడం సరికాదని గౌరవ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. 'వివిధ భాషలు, వివిధ ఆచారాలున్నా భారతదేశమంతా ఒక్కటే. మనమంతా ఒక్కటే. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ విశిష్టత' ఈ సాంస్కృతిక గొప్పదనాన్ని కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

సోమవారం హిందీ దివస్ సందర్భంగా మధుబన్ విద్యాసంబంధిత ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాల సమావేశంలో ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. ఎవరి మాతృభాషను వారు నేర్చుకుంటూనే మరో భారతీయ భాషను కూడా నేర్చుకోవాలని సూచించారు. ఆ తర్వాత పరాయి భాషలను నేర్చుకోవడంలో తప్పులేదన్నారు. ఎన్ని ఎక్కువ భాషలొస్తే అంత ప్రగతి సాధించేందుకు వీలవుతుందన్నారు. హిందీ మాతృభాషగా ఉన్నవారు దక్షిణాది రాష్ట్రాల్లోని భాషలను నేర్చుకోవాలి. హిందీయేతర రాష్ట్రాలవారు హిందీని నేర్చుకోవాలి. ఇతర భాషలోని పదాలను, సామెతలను నేర్చుకుంటుంటే.. ఆ భాష మాట్లాడే వారితో ప్రేమానురాగాలు పెంచుకోవడంతోపాటు సత్సంబంధాలు ఏర్పడతాయి. దేశ సమైక్యత సుదృఢం అవుతుంది' అని ఉపరాష్ట్రపతి సూచించారు. కరోనా సమయంలో తాను ఫోన్లో పలకరించిన వారికి, తనతో మాట్లాడిన వారికి.. తమది కాని మరో భారతీయ భాషను నేర్చుకోవాలని సూచించానన్నారు. ముఖ్యంగా పిల్లలు హిందీ, ఇతర భారతీయ భాషలు నేర్చుకోవాలని చెప్పానన్నారు.

ఒక భాషను ఇతరులపై బలవంతంగా రుద్దడం సరికాదని.. అయితే ఏ భారతీయ భాషను వ్యతిరేకించాల్సిన అవసరం లేదన్న ఉపరాష్ట్రపతి.. వివిధ భారతీయ భాషల్లో అద్భుతమైన జ్ఞానం, చక్కటి సాహిత్యం దాగుందని.. వీటిని తెలుసుకునేందుకైనా వీలైనన్ని ఎక్కువ భాషలను నేర్చుకోవడంపై యువత దృష్టిసారించాలన్నారు. 1946లో మహాత్మాగాంధీ హరిజన్ పత్రికలో 'ప్రాంతీయ భాషల పునాదులపైనే జాతీయ భాష నిలబడుతుంది. జాతీయ భాష, ఇతర భారతీయ భాషలు ఒకదానికొకటి పూరకాలే తప్ప వ్యతిరేకం కాదు. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి' అని పేర్కొన్న సందర్భాన్ని కూడా ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. 1918లో మద్రాసులో దక్షిణ భారత హిందీ ప్రచార సభను స్థాపించి, తన కుమారుడైన దేవదాస్ గాంధీని తొలి ప్రచారక్‌గా నియమించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.తన విద్యార్థి దశలో హిందీ వ్యతిరేక ఉద్యమాలను చూశానన్న ఉపరాష్ట్రపతి.. ఢిల్లీకి వచ్చిన తర్వాత జాతీయస్థాయిలో ప్రతి ఒక్కరూ ఈ భాషను నేర్చుకోవలసిన అవశ్యకతను స్వయంగా గ్రహించానని తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో హిందీని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో హిందీ భాష పట్ల గౌరవభావాలున్నాయని.. ప్రాధాన్యత తెలియని కొద్దిమంది మాత్రమే దీన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు.మాతృభాషలకు సరైన గౌరవం కల్పించేదిశగా నూతన జాతీయ విద్యావిధానంలో తీసుకున్న చర్యలను కూడా ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి ప్రశంసించారు. కనీసం ప్రాథమిక విద్య వరకైనా మాతృభాషలో కొనసాగించే విద్యావిధానం ద్వారా చిన్నారిలో మేధోవికాసానికి బాటలు పడతాయని ఆయన పేర్కొన్నారు. ముందుగా మాతృభాష, తర్వాత ఇతర భారతీయభాషలు నేర్చుకున్న తర్వాత ఆంగ్లం, ఫ్రెంచ్, జర్మనీ, జపనీస్ వంటి ఎన్ని భాషలు నేర్చుకున్నా మంచిదేనన్నారు.

నేడు కోడెల వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రకృతి వనాలకు ప్రథమ స్థానం..!!

-జిల్లా కలెక్టర్ హనుమంతరావు.

సంగారెడ్డి, సెప్టెంబర్ 15 (నేటినిజం ప్రతినిధి) పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తహసీల్దార్లు ఎంపీడీవోలకు ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఈవోలు , ఎం పీ ఓ లు, ఏ పీ ఓ లతో పల్లె ప్రకృతి వనాల పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాల కొరకు భూమిని గుర్తించాలన్నారు. ప్రతీ గ్రామం, తాండా లో పల్లె ప్రకృతి వనాలకు భూమిని గుర్తించి కేటాయించాలన్నారు. ప్రభుత్వ భూములు ,గ్రామ కంఠం భూములను గుర్తించి ఇవ్వాల్సిన బాధ్యత తహసిల్దార్ లదేనని తెలిపారు. గుర్తించిన భూమికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ప్రత్యామ్నాయ భూమిని చూడాలని సూచించారు. ప్రభుత్వ భూమి లేని చోట అటవి భూములకు సంబంధించిన భూమిని కేటాయిస్తూ తీర్మానం చేస్తూ ప్రతిపాదనలు పంపాలని తహశీల్దార్లకు సూచించారు. ప్రభుత్వ భూమి లేదని తహశీల్దార్లు ధ్రువీకరణ చేయాలన్నారు.అటవీ భూములను తీసుకొనుటకు ప్రతిపాదనలను రేపటిలోగా పంపాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాలు వేగవంతంగా గ్రౌండింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కనీసం 20 గుంటల భూమి ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో అటవీ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నారు. ఈనెల 20లోగా అన్ని గ్రౌండింగ్ కావాలన్నారు. భూమి విషయంలో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఎంపీడీవో , తహసిల్దార్ టీములు సంయుక్తంగా వెళ్లి పరిష్కరించాలన్నారు. తహసిల్దార్ ,ఎంపీడీవో సంయుక్తంగా వెళ్లి పల్లె ప్రకృతి వనాల కు సంబంధించిన పనులు మొదలు పెట్టించా లన్నారు. అటవీ భూమికి సంబంధించి రిజల్యూషన్ చేసి ప్రతిపాదనలు పంపడంపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ప్రభుత్వ భూములు లేనప్పుడు అటవీ భూమి ఉన్నట్లయితే ఈ విషయాన్ని ధృవీకరిస్తూ అటవీ భూమిని కేటాయించడానికి ప్రతిపాదనలు పెట్టాలని కలెక్టర్ సూచించారు. పల్లె ప్రకృతి వనాలకుభూమిని గుర్తించడం, సమస్యలను పరిష్కరించి , భూమిని స్వాధీనం చేయడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అన్ని గ్రామాలు పల్లె ప్రకృతి వనాలతో పచ్చదనం ఆహ్లాదం కలిగించే విధంగా కళకళలాడాలని కలెక్టర్ అభిలషించారు.ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ లు వీరారెడ్డి, రాజా ర్షి షా, డి పి ఓ వెంకటేశ్వర్లు, డి ఆర్ డి ఓ శ్రీనివాసులు, సీఈఓ ఎల్లయ్య, రెవిన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి

హరితహారంతో మంచి ఫలితాలు వచ్చాయి

అసెంబ్లీలో మంత్రి కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో అర్బన్ పార్కుల అభివృద్ధికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. హరితహారంతో పచ్చదనం పెంపు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావడంతో మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా అర్బన్ పార్కుల అభివృద్ధిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. ఇప్పటికే తెలంగాణలో 1893 అభివృద్ధి చెందిన అర్బన్ పార్కులు ఉన్నాయని తెలిపారు. ఈ పార్కులతో పాటు అదనంగా మరో 1799 అర్బన్ పార్కులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే 797 పార్కులను అభివృద్ధి చేశామన్నారు. మొత్తంగా జీహెచ్ఎంసీ పరిధిలో 587, ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో 1109, హెచ్ఎండీఏ పరిధిలో 103 పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ పార్కుల్లో కొన్నింటిని థ్రీ పార్కులుగా, మరికొన్నింటిని ల్యాండ్ స్కేప్, అర్బన్, పంచతత్వ పార్కులుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించమన్నారు. సీఎం కేసీఆర్ ను మించిన హరిత ప్రేమికుడు ప్రపంచంలో ఎక్కడా లేరు అనుకుంటున్నానని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో పెట్టని విధంగా మున్సిపాలిటీ బ్జడెట్‌లో 10 శాతం గ్రీన్ బ్జడెట్‌ను పెట్టారు. పట్టణ హరిత ప్రణాళిక రూపొందించుకుని మొక్కలు నాటుతున్నారని తెలిపారు. హరితహారం ఒక సంస్కృతిగా మారిందన్నారు. ప్రతి పౌరుడి నరనరాన హరితహారం కార్యక్రమం ఉండిపోయిందన్నారు. 80 శాతం మొక్కలను బతికించేం దుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు. భవిష్యత్ తరాల కోసం ఈ కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ చేపట్టారని చెప్పారు. రాష్ట్రంలో గ్రీన్ కవర్ 29 శాతానికి పెరిగిందన్నారు. ఈ ఘనత తమకే దక్కుతుందన్నారు. పంచదనం పెంపు వల్ల రాజకీయాలు ఉండవు అని మంత్రి స్పష్టం చేశారు. దేశంలోనే అతిపెద్ద అర్బన్ ఎకో పార్కు మహబూబ్‌నగర్ జిల్లాలో 287 ఎకరాల్లో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఏర్పాటు చేశారని తెలిపారు. జీహెచ్ఎంసీ పార్కుల్లో స్థలం ఉంటే అక్కడ ఓపెన్ జిమ్‌లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కేటీఆర్ తెలిపారు.

కృష్ణానది జలవివాదాలను పరిష్కరించండి

రాజ్యసభలో కేంద్రాన్ని కోరిన సురేశ్ రెడ్డి

న్యూఢిల్లీ,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): కృష్ణానది జలాల పంపక విషయంలో ఏర్పడ్డ సమస్యను పరిష్కరించా లని టీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి రాజ్యసభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా నది జలాల పంపకం అంశంపై పలుమార్లు సీఎం కేసీఆర్ లేఖలు రాసినా కేంద్ర ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. కృష్ణా నది నీటి పంపకం సమస్యను బ్రిజేశ్ ప్యానెల్‌కు రిఫర్ చేయడం వల్ల తెలంగాణ ప్రజలకు న్యాయం జరగడం లేదన్నారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. నీటి కోసమే తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని చేపట్టారని, రెండు రాష్ట్రాల ఏర్పాటు తర్వాత వాటర్ షేరింగ్ సమస్యగా మారిందన్నారు. ఇంటర్ స్టేట్ వాటర్ డిస్‌ప్యూట్ యాక్ట్ ప్రకారం సమస్యను పరిష్కరించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. వాటర్ డిస్‌ప్యూట్ యాక్ట్‌లోని సెక్షన్ 3 ప్రకారం సమస్యను పరిష్కరించాలంటూ సీఎం కేసీఆర్ .. కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధాని మోదీతో పాటు జలశక్తి మంత్రికి, కేంద్ర ప్రభుత్వ అధికారులకు కూడా సీఎం కేసీఆర్ లేఖలు రాసినట్లు సురేశ్ రెడ్డి గుర్తు చేశారు. వాటర్ షేరింగ్ సమస్యను సెక్షన్ 5 ప్రకారం.. కాన్‌స్టిట్యూషనల్ బెంచ్‌కు రిఫర్ చేయాలని కూడా సీఎం సూచించినట్లు తెలిపారు. సమస్యను ట్రిబ్యునల్‌లోని సెక్షన్ 3, 5 కింద పరిష్కరించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు ప్రధాన కారణం వాటర్ షేరింగ్ అని ఎంపీ సురేశ్ రెడ్డి తెలిపారు. ఆరేళ్ల నుంచి ఏపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, తమ మధ్య బంధం బాగుందని, అయితే వాటర్ షేరింగ్ అంశాన్ని తక్షణమే పరిష్కరించాలని ఆయన కేంద్రాన్ని కోరారు.

కేంద్ర విద్యుత్ బిల్లుతో రైతులకు ఉరి

ప్రతి బోరు,బావికి మోటర్ బిగించాల్సి వస్తుంది

స్వల్పకాలిక చర్చలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఆందోళన

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువస్తున్న విద్యుత్ చట్టంతో రైతులకు ఇబ్బందులు కలుగుతాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ రంగంలో తెలంగాణ సాధించిన ప్రగతి, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యుత్ సవరణ బిల్లు, శ్రీశైలం పవర్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంపై శాసనసభలో మంత్రి స్వల్ప కాలిక చర్చ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రాలను సంప్రదించాకే కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ చట్టానికి సవరణ చేయడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతమని చెప్పారు. కొత్త విద్యుత్ చట్టంతో అన్ని వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించాల్సి వస్తోందన్నారు. మీటర్ల తయారీ వ్యయం డిస్కంలకు అదనపు భారంగా మారనుందని తెలిపారు. కొత్త విద్యుత్ చట్టం ప్రకారం టారిఫ్ విధానం మారుతుందన్నారు.

పేదలు, వెనుకబడిన వర్గాలు పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించాల్సి వస్తుందన్నారు.

ఈ చట్టంతో థర్మల్ విద్యుత్ వినియోగం తగ్గుందని మంత్రి పేర్కొన్నారు. ఎక్కడి నుంచైనా విద్యుత్ తీసుకునేందుకు కొత్త చట్టం అవకాశం ఇస్తోంది. క్రాస్ సబ్సిడీ అమలు చేస్తున్న తెలంగాణకు ఇదంతా పెద్ద భారమని మంత్రి స్పష్టం చేశారు. కేంద్రం ప్రతిపాదించే కొత్త చట్టం వల్ల గ్రిడ్ నిర్వహణ భారం పెరుగుతుందన్నారు. కొత్త చట్టం మేరకు లైసెన్స్ ఉన్న సంస్థలు ఎక్కడైనా విద్యుత్ కొని ఎవరికైనా అమ్మవచ్చు. మొత్తంగా కేంద్రం తీసుకువచ్చే కొత్త విద్యుత్ చట్టంతో రైతులకే కాకుండా, పరిశ్రమలపై కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ రంగంలో అనేకమైన విజయాలు సాధించాం. అన్ని రంగాలకు నాణ్యమైన 24 గంటల విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. నాడు కరెంట్ కోతలు, పవర్ హాలిడేలు ఉండేవి. తెలంగాణ ఏర్పడిన తర్వాత మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారింది. విద్యుత్ సరఫరాలో మన రాష్ట్రమే టాప్‌లో ఉందన్నారు. దేశంలో అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ నాలుగో స్థానంలో ఉంది. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక విద్యుత్ ఉద్యోగులకు రెండు సార్లు వేతనాలు పెంచామని గుర్తు చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేస్తోందని మంత్రి జగదీశ్ రెడ్డి ఉర్తు చేశారు. శ్రీశైలం విద్యుత్ ప్లాంట్‌లో ప్రమాదం జరగడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. కంట్రోల్ ప్యానల్స్ లో ప్రమాదం జరగడంతో విధుల్లో ఉన్న సిబ్బంది మంటలను ఆర్పివేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలించలేదు. మొత్తం 35 మంది ఉద్యోగుల్లో 29 మంది టన్నెల్స్ ద్వారా బయటకు రాగలిగారు. అగ్నిప్రమాదం వల్ల దట్టమైన పొగ ఆవరించడంతో.. 9 మంది విగతజీవులయ్యారు. సంస్థను కాపాడే క్రమంలో ఉద్యోగుల త్యాగం వెలకట్టలేనిది అని మంత్రి అన్నారు. ఉద్యోగుల కుటుంబానికి కలిగిన నష్టం పూడ్చలేనిది. వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. మరణించిన ఏడుగురు కుటుంబాల్లో అర్హులైన వారికి ఉద్యోగం కల్పించేలా చూడాలని జెన్‌కోకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. శ్రీశైలం ప్రమాదంపై సీఐడీ విచారణకు ఆదేశించామని మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు.

గవర్నర్‌తో నేవీ మాజీ అధికారి భేటీ

ఇక నుంచి బిజెపితోనే ఉంటానని ప్రకటన

ముంబై,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): ఇక నుంచి తాను బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తోనే ఉంటున్నట్లు నేవీ మాజీ అధికారి మదన్‌శర్మ తెలిపారు. మహారాష్ట్ర గవర్నర్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. శివసేన కార్యకర్తలు తనపై దాడి చేసేప్పుడు తాను బీజేపీ-ఆర్ఎస్ఎస్‌తో ఉన్నానని ఆరోపణలు చేశారు. కాబట్టి ఇప్పుడు నేనే స్వయంగా ప్రకటిస్తున్నాను. ఈ రోజు నుంచి తాను బీజేపీ-ఆర్ఎస్ఎస్ సభ్యుడనని ఆయన పేర్కొన్నారు. నేవీ వెటరన్ మదన్‌శర్మ మంగళవారం మహారాష్ట్ర గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీని కలిశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీతో సందర్భంగా ఆయన తనపై శివసేన కార్యకర్తలు జరిపిన దాడిని గురించి వివరించారు. తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గవర్నర్‌కు విన్నవించారు. మదన్ శర్మ (65) పై ముంబైలో శివసేన కార్యకర్తలు నలుగురు దాడికి పాల్పడ్డారు. సీఎం ఉద్ధవ్‌ను అపహాస్యం చేస్తూ గీసిన కార్టూన్‌ను ఫార్వర్డ్ చేశారంటూ ఆయన నివాసానికి వెళ్లి శివసేన కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో దాడికి పాల్పడ్డవారిని పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే వీరు బెయిల్‌పై విడుదలయ్యారు. దీనిపై మదన్‌శర్మ స్పందిస్తూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించలేకపోతే మహారాష్ట్ర సీఎం పదవికి ఉద్ధవ్ థాకరే వెంటనే రాజీనామా చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. శాంతిభద్రతలను చూసుకోలేకపోతే తక్షణమే సీఎం పదవికి రాజీనామా సమర్పించాలన్నారు. ప్రజలే నిర్ణయిస్తారు ఎవరూ సీఎంగా ఉండాల్నో అని పేర్కొన్నారు. తన కార్యాలయాన్ని కూల్చివేయడంపై బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సైతం గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారీని కలిసి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే.

మెదక్ జిల్లాను కరుణించిన వరుణుడు

మెదక్,సెప్టెంబర్15(నేటినిజం ప్రతినిధి): దాదాపు నెలరోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్నరైతన్నలకు వరుణుడి కరుణతో ఊరట కలిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒకేరోజు జిల్లా అంతటా భారీ వర్షం పడడంతో చెరువుల్లోకి వరద పెరిగింది. వర్షాకాలం మొదలైన తర్వాత జిల్లాలో ఇంత పెద్దఎత్తున వర్షం పడలేదు. జిల్లావ్యాప్తంగా రాత్రి భారీవర్షం కురిసింది.

కేంద్ర ప్రభుత్వం తీరు మారాలి : మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట, , సెప్టెంబర్ 15: రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన విద్యుత్ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే తెలంగాణ ప్రజల కోపానికి బీజేపీ గురికాక తప్పదని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. జిల్లాలోని దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం రూ. 1.60 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను మంత్రి ప్రారంభించారు.

తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, ఒక్కరూపాయి ఖర్చు లేకుండా రైతులకు 24 గంటలు ఉచితంగా కరెంటు సరఫరా చేస్తున్నదని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. రైతుల బోరు బావులకు మీటర్లు పెట్టాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చెబుతున్నదని, దుబ్బాకలో బీజేపీ ఓటు అడగాలంటే.. రైతుల బోరు బావుల మీటర్లకై పార్లమెంటులో పెట్టిన బిల్లు ఉపసంహరణ చేసుకోవాలని మంత్రి సూచించారు. దౌల్తాబాద్ ప్రాంత రైతుల మేలు కోసం దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి ఎంతో ఆలోచన చేశారని తెలిపారు.

రైతుల కోసం రైతుబంధు, రైతు బీమాతో పాటు ఎన్నో రైతు సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ చేపట్టారని హరీశ్ రావు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దుబ్బాక నియోజకవర్గంలో 20 వేల మంది బీడీ కార్మికులకు బీడీ కార్మిక భృతి ఇస్తున్నదని, అదే విధంగా 56 వేల 906 మంది అర్హులకు ఆసరా ఫించన్లు అందిస్తున్నట్లు తెలిపారు. అవినీతికి ఆస్కారం లేకుండా కొత్త రెవెన్యూ చట్టం తెచ్చి రైతులకు, పేదలకు సీఎం కేసీఆర్ మరింత దగ్గరయ్యారని మంత్రి వెల్లడించారు.

అనంతరం సిద్ధిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ దౌల్తాబాద్ మండలంలోని మల్లేశంపల్లి గ్రామంలో రూ. 1.10కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మంత్రి వెంట సర్పంచ్ లు యాదమ్మ, సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ వేలేటి రోజాశర్మ, ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు అన్నపూర్ణ, విద్యుత్ శాఖ ఏస్ఈ కరుణాకర్ బాబు, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గ, మండలాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యంతో కెసిఆర్ చిత్రపటానికి అభిషేకం



సిద్దిపేట,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): నూతన రెవెన్యూ చట్టం శాసనమండలిలో ఆమోదం పొందడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. జిల్లాలోని మద్దూరు మండల కేంద్రంలో సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో.. సీఎం కేసీఆర్ చిత్రపటానికి గ్రామస్తులు ధాన్య అభిషేకంతో పాటు క్షీరాభిషేకం చేశారు. అనంతరం పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కొత్త రెవెన్యూ చట్టంతో రైతుల ఇబ్బందులు తొలగినట్లేనని సంతోషం వ్యక్తం చేశారు.

దేశంలో 78.28 శాతం కరోనా రికవరీ రేటు

-తాజాగా వైరస్ బారిపడి 1054 మంది మృతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా వైరస్ విజృంభిస్తోంది. గడచిన 24 గంటలలో అత్యధికంగా రికార్డ్ స్థాయిలో 83,809 కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దీంతో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 49,30,237కు చేరింది. తాజాగా వైరస్ బారిపడి 1054 మంది మృతి చెందగా.. ఇప్పటి వరకు మృతి చెందిన వారి సంఖ్య 80,776కి పెరిగింది. గడిచిన 24 గంటల్లో దేశ వ్యాప్తంగా 79,292 డిశ్చార్జ్ అయ్యారు. దీంతో మొత్తం కోలుకున్న వారిసంఖ్య 38,59,400గా నమోదైంది. దేశంలో 78.28 శాతం కరోనా రోగుల రికవరీ రేటు ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం విడుదల చేసిన హెల్త్ బులిటెన్‌లో పేర్కొంది. యాక్టివ్ కేసుల శాతం 20.08 శాతం ఉండగా... దేశ వ్యాప్తంగా యాక్టీవ్ కేసులు 9,90,061 ఉన్నాయి. దేశంలో మొత్తం నమోదయిన కేసులలో మరణాల రేటు 1.64 శాతానికి తగ్గింది. ఇక గడచిన 24 గంటలలో దేశంలో 10,72,845 కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షల నిర్వహించారు. ఇప్పటివరకు నిర్వహించిన మొత్తం కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షల సంఖ్య 5,83,12,273గా నమోదైనట్లు కేంద్రవైద్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సాహం

హైదరాబాద్,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఇష్టపడి చదివేలా ప్రోత్సహిస్తున్నామని గురుకులాల సెక్రటరీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని చెప్పారు. సుమారు 7 వందల మందికి పైగా ర్యాంకులు వచ్చాయన్నారు. నిరంతరం విద్యార్థుల ఆలనా.. పాలనా చూడడంతోపాటు విద్యాబోధనా, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా ప్రిన్స్‌పాల్స్, సిబ్బంది కృషి చేశారన్నారు.

ధరల పెరుగుదలతో ఉల్లి ఎగుమతులపై నిషేధం

-కేంద్ర నిర్ణయంతో మహారాష్ట్ర రైతుల మండిపాటు

న్యూఢిల్లీ,సెప్టెంబర్15(ఆర్ఎన్ఎ): దేశంలో మళ్ళీ ఉల్లి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఎగుమతులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. గతేడాది ఉల్లి సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ముందు జాగ్రత్తల్లో భాగంగా ఉల్లి ఎగుమతిపై నిషేధం విధించింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వస్తుందని ప్రకటించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఉల్లి ఎగుమతిపై నిషేధం కొనసాగుతుందని ప్రకటించింది. గత కొన్ని రోజులుగా దేశంలో విస్తారంగా వర్షాలు కూరుతున్న నేపథ్యంలో దేశంలో ఉల్లిపంట దిగుబడి తగ్గిపోయింది. డిమాండ్ కు తగినంతగా ఉల్లి లేకపోవడంతో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. గతేడాది ఉల్లి ధరలు ఇదే సమయంలో కేజీ 40 నుంచి వందకు పెరిగింది. ఒకానొక దశలో ఉల్లి ధర ఏకంగా రూ.150కి చేరింది. అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు గాను కేంద్రం ఎగుమతులపై నిషేధం విధిస్తు నిర్ణయం తీసుకుంది. ఉల్లిపాయల ఎగుమతిపై నిషేధం తక్షణం అములోకి వస్తుందన్న కేంద్ర ప్రభుత్వం ప్రకటనపై మహారాష్ట్రలోని ఉల్లి రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉల్లి పంట మార్కెట్‌లోకి భారీగా వస్తున్నదని నాసిక్ రైతులు చెప్పారు. ఎగుమతులపై తక్షణం నిషేధం విధించడం వల్ల ఉల్లిని ఎక్కడ నిల్వ చేయాలి, ఎక్కడ అమ్ముకోవాలని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం కిలో ఉల్లి రూ.20-25కు అమ్ముడు పోతున్నదని, ఎగుమతులపై నిషేధం వల్ల ఈ ధర రూ.2-3కు పడిపోతుందని వాపోయారు. ఉల్లిని పండించే తమ లాంటి రైతులు బాగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎగుమతులపై నిషేధం వల్ల దళారులు లబ్దిపొందుతారని ఆరోపించారు. వారు తక్కువ ధరకు భారీగా ఉల్లిని కొని ఆ తర్వాత ఎక్కువ ధరకు అమ్ముకుంటారని చెప్పారు. ఎగుమతులపై నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం నిర్ణయం వల్ల ఉల్లి రైతులకు నష్టం, దళారులకు లాభం చేకూరుతుందని నాసిక్ ఉల్లి రైతులు విమర్శించారు.

ఆరు వెంటిలేటర్లు విరాళంగా అందించిన లానెక్సెస్

థానెలోని ఆసుపత్రులకు

థానె, సెప్టెంబర్ 15: దేశంలో కరోనాపై జరుగుతున్న పోరుకు తోడ్పడేలా స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లానెక్సెస్ నేడిక్కడ రూ.1 కోటి విలువైన ఆరు వెంటిలేట్లరను థానె లోని కౌశల్య మెడికల్ ఫౌండేషన్ ట్రస్ట్ హాస్పిటల్, బెథాని హాస్పిటల్ లకు విరాళంగా అందించింది. ఒక్కో హాస్పిటల్ కు మూడు వెంటిలే టర్ల చొప్పున ఇచ్చింది. 2020 ? 21 కు గాను కంపెనీ యొక్క సీఎస్ ఆర్ కార్య క్రమం కింద ఈ విరాళాలను అందించింది.

థానె లో నెలకొన్న ఈ హాస్పిటల్స్ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన రోగులకు చికిత్స కోసం ఈ వెంటిలేటర్లను ఉపయోగిస్తాయి. ఈ మహమ్మారి పై పోరాటా నికి గాను స్థానిక ప్రజలకు సాయపడేందుకు లానెక్సెస్ వివిధ సంస్థలతో కలసి చురుగ్గా పని చేస్తోంది.

కోవిడ్ -19 ప్రభావాన్ని తగ్గించేందుకు సంబంధించి గత కొన్ని నెలల్లో లానెక్సెస్ ఇండియా వివిధ కార్యక్రమాలను చేపట్టింది. ప్రైమ్ మినిస్టర్స్ సిటిజన్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిట్యుయేషన్స్ ఫండ్ (పీఎం కేర్స్) కు రూ.2 కోట్లు విరాళంగా అందించింది. మహారాష్ట్ర,మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో రూ. 30 లక్షల విలువైన వస్తువులను విరా ళంగా అందించింది. అక్షయపాత్రతో కలసి అవసరంలో ఉన్న వారికి 30,000 కు పైగా ఉచిత భోజనాలను అందించింది. ఒకరి నుంచి మరొకరికి కరోనా వైరస్ సోకకుండా ఉండేందుకు గాను లానెక్సెస్ ఒక టన్ను మేరకు తన అత్యంత ప్రభావపూరిత ఉపరితల క్రిమినాశిని రిలే+ ఆన్ విర్కాన్? ను బీఎంసీ మరియు టీఎంసీ లకు మహారాష్ట్ర ప్రభుత్వ సహాయ సమన్వయ కేంద్రం ద్వారా అందించింది.

ఈ సందర్భంగా కౌశల్య మెడికల్ ఫౌండేషన్ ట్రస్ట్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రిప్లేస్ మెంట్ సర్జన్ డాక్టర్ సమీప్ సొహోని (ఎంఎస్ ఆర్థో, డీఎన్ బీ ఆర్థో, ఎఫ్ఐసీఎస్ (యూఎస్ఏ)) మాట్లాడుతూ, ''ఈ వెంటిలేటర్లను అందించినందుకు గాను లానెక్సెస్ ఇండియాకు మా ధన్యవాదాలు. మాకు ఇ వెంతో ముఖ్యమైన ఉపకరణాలు. ఆక్సీజన్ స్థాయిలు తక్కువగా ఉన్న వారికి, ఐసీయూ లోని కోవిడ్ రోగులకు చికిత్స అందించడంలో అవెంతో ముఖ్యం. ఈ విధమైన మద్దతుకు గాను లానెక్సెస్ ఇండియా యాజమాన్యానికి మా ధన్యవా దాలు. మరింత మంది ప్రాణాలు కాపాడేందుకు ఈ విరాళం మాకు తోడ్పడు తుంది. గత 5 నెలలుగా కోవిడ్ రోగుల కోసం అవిశ్రాంతంగా పని చేస్తున్న మా జట్టుకు ఎంతో నైతిక మద్దతు లభించినట్లయింది" అని అన్నారు.

కరోనా విజృంభణతో గ్రామంలో పూర్తి లాక్‌డౌన్

సంగారెడ్డి,సెప్టెంబర్15(నేటినిజం ప్రతినిధి): కరోనాను ఎదుర్కొనేందుకు గ్రామంలోని వారంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చారు. ఊరంతా ఒకే మాటమీద ఉన్నారు... సంగారెడ్డి జిల్లా కంగ్టిలో కరోనా వైరస్ వ్యాప్తి పెరగడంతో ప్రజలు స్వచ్ఛంధంగా లాక్ డౌన్ విధించుకున్నారు. కోవిడ్ బారిన పడి గ్రామానికి చెందిన ఒకరు హైదరాబాద్‌లో చనిపోయారు. మరొకరు కంగ్టిలో ప్రాణాలు విడిచారు. దీంతో గ్రామస్తులందరూ ఒక నిర్ణయానికి వచ్చారు. కోవ